# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
III హైదరాబాద్, గురువారం 24 ఏప్రిల్ 2025 SANGAREDDY


## 27న పార్టీ జెండాలు ఆవిష్కరించాలి


మామిడ్గిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

- బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి
- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 23: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామ శివారులోని ఎస్ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి చైతన్యపర్చాలన్నారు. ఈనెల 27న మండలంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో ఉదయం పార్టీ జెండాలను అవిష్కరించిన తర్వాత ప్రత్యేక వాహనాల్లో వరంగల్ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలను భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, న్యాల్‌కల్, జహీరాబాద్, ఝరాసంగం మండలాల పార్టీ అధ్యక్షులు రవీందర్, తట్టు నారాయణ, వెంకటేశం, మండల పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, సంగ్రాంపాటిల్, భూమరెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హనీఫ్, వెంకట్, దేవదాస్, మహేశ్, వెంకట్‌రెడ్డి, ఉమేశ్, మండల మాజీ సర్పంచ్, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీకుమార్, షబ్బీర్‌ఖాన్, మాజీ సర్పంచులు మారుతీ యాదవ్, శ్రీనివాస్, మహిపాల్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.


చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## కారణజన్ముడు కేసీఆర్

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 23: కేసీఆర్ కారణ జన్ముడని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేసీఆర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దుబ్బాక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన సంబురాలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేసీఆర్ అలుపెరుగని పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. ఈనెల 27న జరుగనున్న రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఛలో వరంగల్ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

# జబ్బకు సంచి.. చేతిలో గులాబీ జెండా..

## పోదాం పదా అంటూ రజతోత్సవ సభకు పాదయాత్రగా వెళ్లనున్న యువత

- ప్రత్యేకంగా టీషర్టులు, గులాబీ జెండా, ప్రచార రథం, కళా ప్రదర్శనలు
- సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1500 మంది పాదయాత్ర
- రేపు ఉదయం 6గంటలకు రంగధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభం
- గులాబీ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించనున్న హరీశ్‌రావు
- మూడు రోజుల పాటు 64 కిలోమీటర్లు కొనసాగనున్న పాదయాత్ర
- పాదయాత్రలో భాగంగా పల్లెపల్లెనా కాంగ్రెస్ పాలనను ఎండగట్టనున్న యువత


సిద్దిపేట నుంచి బయలుదేరే యువత పాదయాత్రకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు


టీషర్టులు


పాదయాత్రకు ప్రత్యేకంగా తయారుచేసిన ప్రచార రథం

సిద్దిపేట, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేట బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సమాయత్తం అయ్యింది. పురిటిగడ్డ నుంచి యువత పాదయాత్రగా కేసీఆర్ సభకు బయలుదేరుతున్నారు. వినూత్న తరహాలో పాదయాత్ర చేపడుతున్నారు. జబ్బకు సంచి ..చేతిలో గులాబీ జెండా...గులాబీ టీషర్టు వేసుకొని గులాబీ సైనికులు సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1500 మంది శుక్రవారం ఉదయం 6గంటలకు రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి బయలుదేరుతారు. ఈ పాదయాత్రను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గులాబీ జెండాను ఊపి ప్రారంభించనున్నారు. దీనికోసం అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని యువత, విద్యార్థులు పాల్గొననున్నారు. యువత పాదయాత్ర మూడు రోజులు పాటు కొనసాగనున్నది. ఈ పాదయాత్ర కోసం హరీశ్‌రావు ప్రత్యేక ఒక కమిటీని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. సిద్దిపేట నుంచి రజతోత్సవ సభ 64 కిలోమీటర్లు కొనసాగుతుంది. హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు వరకు పాదయాత్ర చేరుకుంటుంది.యువత పాదయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా ఉండనున్నది. ప్రత్యేకంగా ఒక ప్రచార రథాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సిద్దిపేట- హన్మకొండ రహదారి మీదుగా కొనసాగనున్న పాదయాత్రలో భాగంగా ఆయా గ్రామాల వద్ద యువత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టనున్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను యువత గ్రామాల్లోని ప్రజలకు అర్థమయ్యేలా వివరించన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్లలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలన, తెలంగాణలో వ్యవసాయం పండుగలా చేసుకున్న వైనం, సాగు, తాగునీరు తదితర అంశాలపై ప్రజలకు వివరించనున్నారు. ప్రత్యేకంగా కళా ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇందుకోసం రెండు బృందాలను పాదయాత్రలో ఏర్పాటు చేశారు.

### పాదయాత్రకు ప్రత్యేకంగా కమిటీ...

పాదయాత్రకు ప్రత్యేక కమిటీని హరీశ్‌రావు నియమించారు. పూజల వెంకటేశ్వర్లు(చిన్న) సమన్వయకర్తగా నియమించిన కమిటీలో సీనియర్ నాయకులు కోల రమేశ్ గౌడ్, శ్రీహరి యాదవ్, ప్రభాకర్ వర్మ, భూమయ్యగారి కిషన్ రెడ్డి, మెర్గు మహేశ్ ఉన్నారు. వీరు యువత పాదయాత్ర సందర్భంగా వారి వెంట ఉంటారు. రాత్రి బస కల్పించడం, తాగునీటి వసతి తదితర అంశాలను వీరు చూసుకుంటారు. ఇప్పటికే ఈ కమిటీ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఏ రోజు ఎక్కడ వరకు పాదయాత్ర చేయాలి. ఎక్కడి రాత్రి బసచేయాలి అనే దానిపై ప్రణాళిక సిద్ధం చేశారు.

### మూడు రోజులు 64 కిలోమీటర్లు

సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద 25న యువత పాదయాత్రను హరీశ్‌రావు ప్రారంభిస్తారు. అక్కడి నుంచి పాదయాత్ర పాలమాకుల, బద్దిపడగ, బస్వాపూర్, సముద్రాల, పందిల్ల, హుస్నాబాద్, ముల్కనూరు మీదుగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో 27న సాయంత్రం జరిగే రజతోత్సవ సభకు వద్దకు చేరుకుంటుంది. ప్రతి గ్రామం నుంచి 20 నుంచి 30 మంది యువత పాదయాత్రలో భాగమవుతున్నారు. ఇప్పటికే చాలామంది యువత మేము సైతం అంటూ పాదయాత్రలో పాల్గొనడానికి కమిటీకి తమ పేర్లు ఇచ్చి నమోదు చేయించున్నారు. పాదయాత్రగా వెళ్లేవారికి పత్యేక టీషర్టులు, టోపీలు, గులాబీ జెండాలు అందిస్తారు. వారి వెంట కళాజాత ఉండనున్నది. మూడు రోజుల పాటు 64 కిలోమీటర్లు పాదయాత్ర చేపడతారు. 25న సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి ఉదయం 6గంటలకు బయలుదేరుతారు. ఆరోజు మధ్యాహ్నం వరకు పాలమాలకు ఎల్లమ్మగుడి వద్దకు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్న భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం బయలుదేరి బద్దిపడగ ఎల్‌వీఆర్ ఫంక్షన్‌హాల్‌కు రాత్రి 8 గంటల వరకు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.26న ఉదయం బయలుదేరి సముద్రాలకు మధ్యాహ్నం వరకు చేరుకుంటారు. అక్కడ స్థానిక ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత హుస్నాబాద్ మీదుగా రాత్రి 8 గంటలకు పోతారం చేరుకుంటారు. అక్కడే బస చేస్తారు. 27న పోతారం నుంచి బయలుదేరి ముల్కనూరుకు మధ్యాహ్నం చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత బయలు దేరి సాయంత్రం ఎల్కతుర్తి సభకు చేరుకుంటారు. సభ అనంతరం సిద్దిపేట నుంచి వెళ్లిన బస్సుల్లో తిరుగు ప్రయాణమవుతారు.

## పోలీసుల నిర్బంధంలో జిన్నారం


జిన్నారం గ్రామ సమీపంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీ చేస్తున్న పోలీసులు

జిన్నారం, ఏప్రిల్ 23: జిన్నారం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై దేవుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 163 సెక్షన్ (144 సెక్షన్)ను విధించారు. జిన్నరం వచ్చే ప్రధాన రహదారుల చౌరస్తాల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గ్రామంలోకి వచ్చే వాహనాలను, వ్యక్తులను ఆధారాలు చూసి, తనిఖీ చేసి అనుమతిస్తున్నారు. గ్రామంలో కొనసాగుతున్న 163 సెక్షన్ అమలను ఎస్పీ పరితోష్ పంకజ్ స్వయంగా పర్యవేక్షించారు. మదర్సా వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. గ్రామంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. జన సంచారం లేక బుధవారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రత్యేక పోలీసు బలగాలు నిరంతరం పహారా కాస్తున్నాయి. బుధవారం జరిగే మార్కెట్‌ను నిర్వహించవద్దని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని పోలీసులు సూచించారు.

## మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

సంగారెడ్డి, ఏప్రిల్ 23: జిన్నారంలో శివలింగాన్ని కోతులు తోసివేయడంతో ధ్వంసమైనట్లు మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిన్నారం ఘటనపై పోలీసు శాఖ సమగ్ర విచారణ చేపట్టినట్లు చెప్పారు. పోలీసుల విచారణలో కోతుల కారణంగానే జిన్నారంలో నిర్మాణంలో ఉన్న శివాలయంలో శివలింగం దెబ్బతిన్నట్లు తేలిందన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఐజీ సత్యనారాయణ ప్రదర్శించారు. ఈనెల 19న సాయంత్రం 5.24 గంటల సమయంలో కొన్ని కోతులు వచ్చి శివుని విగ్రహాన్ని గుట్టపై నుంచి కిందికి తోసివేసినట్లు చెప్పారు. కోతులు తోసివేయడంతో శివుడి విగ్రహం ధ్వంసమైందన్నారు. మంగళవారం సాయంత్రం మదర్సా విద్యార్థులు ఆటలు ఆడుకుని శివాలయం ముందు నుంచి వెళ్తున్న క్రమంలో కొంతమంది వారిని చూశారన్నారు. ఆలయంలో శివుని విగ్రహాన్ని మదర్సా విద్యార్థులు ధ్వంసం చేసి ఉంటారని నిర్ణయానికి వచ్చిన కొందరు ఆందోళనకు దిగినట్లు తెలిపారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా కొంతమంది పెద్దసంఖ్యలో మదర్సా వద్దకు వెళ్లి ఘర్షణకు దిగినట్లు చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని ఐజీ హెచ్చరించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిన్నారంలో సమస్య జఠిలం కాకుండా త్వరితగతిన స్పందించిన ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారులను ఐజీ అభినందించారు.

## సమస్యలు పరిష్కరించండి

- భెల్ ఈడీకి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి


భెల్ ఈడీ కేబీరాజాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 23: సమస్యల పరిష్కారానికి సహకరించాలని భెల్ ఈడీ కేబీరాజాని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. బుధవారం కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ నాయకుడు అంజయ్య, కురుమ సంఘం నాయకుడు కరికె సత్యనారాయణ, తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబ్జీ, లచ్చిరాంనాయక్, విద్యుత్‌నగర్ కాలనీ అధ్యక్షుడు అజీమ్‌తో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భెల్ ఈడీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈఎస్ఐ చర్చి సమీపంలో గల బీరప్ప గుడిని భెల్ భూమిలో ఉందంటూ సంబంధిత అధికారులు తొలిగించడం జరిగిందన్నారు. ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా ప్రహరీని అనుకొని పశువుల కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, వాటిని తొలిగించాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. రాయసముద్రం చెరువు సమీపంలో ఉన్న మసీద్ కూడా భెల్ స్థలంలో ఉందంటూ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. విద్యుత్‌నగర్ బ్రిడ్జి నుంచి సీఐఎస్ఎఫ్ వరకు రోడ్డు చాలా దారుణ పరిస్థితి ఉందని, రోడ్డును బాగుచేయాలని కోరారు. విద్యుత్‌నగర్ హైటెన్షన్ లైన్‌లో డ్రైనేజీ మరమ్మతులు త్వరగా ప్రారంభించాలని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఈడీ సానుకూలంగా స్పందించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నర్సింహ, ఐలేశ్, రాజు, గోవింద్, యాదగిరి, భెల్ అధికారులు ఉన్నారు.

## భూభారతితో భూసమస్యల పరిష్కారం

- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, ఏప్రిల్ 23: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంతో రైతుల భూసమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. కోహెడలో అప్పయ్య గుడి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం తలారి చంద్రయ్య ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. అనంతరం కోహెడలో కుర్మసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత కోహెడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. ప్రతి ఊరికి ఒక వీఆర్వోవోను నియమిస్తామని తెలిపారు. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలోనే భూసమస్యలు పరిష్కరించేలా చట్టం చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ హమీద్ అన్సారీ భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ బోయిని నిర్మలాజయరాజ్, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు మంద ధర్మయ్య, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, మంద పవన్, కర్ణకంటి మంజులారెడ్డి, దొమ్మాట జగన్‌రెడ్డి, బస్వరాజు శంకర్, తడిసిన రవీందర్‌రెడ్డి, కర్ర రవీందర్, కోనే శేఖర్, భీంరెడ్డి మల్లారెడ్డి, తహసీల్దార్ సురేఖ, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## టాపర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే


గాయత్రిని సన్మానిస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, ఏప్రిల్ 23: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో స్టేట్ ర్యాంక్ సాధించిన బొబ్బిలిగామ గ్రామానికి చెందిన విద్యార్థిని గాయత్రిని బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభినందించి శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులోనూ మంచి చదువు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, బొబ్బిలిగామ మాజీ సర్పంచ్ నల్లోల కుమార్, కొండాపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, గోవర్ధన్ రెడ్డి, విజయ్‌కుమార్, హరీశ్, శ్రీధర్, రాకేశ్, నందు, శివాజీ, అనిల్, కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా వడక్‌పల్లి చౌరస్తా

- చౌరస్తా వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక ప్రమాదాలు


జిన్నారం వైపు నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపైకి వస్తున్న పటాన్‌చెరు ఆర్టీసీ బస్సు

పటాన్‌చెరు, ఏప్రిల్ 23: ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి జిన్నారం వైపు వెళ్లే వడక్‌పల్లి చౌరస్తా ప్రమాదకరంగా మారింది. పటాన్‌చెరు, బీరంగూడ వైపు నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వడక్‌పల్లి నుంచి మాదారం, జిన్నారం వైపు వెళ్లేందుకు రోడ్డు ఉంది. సర్వీస్ రోడ్డు నుంచి వడక్‌పల్లి వైపు వెళ్లేందుకు చౌరస్తా ఉన్నా, అక్కడ ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. సర్వీస్ రోడ్డు ఎత్తుపై ఉండగా, వడక్‌పల్లి రోడ్డు గుంతలో ఉండడంతో సర్వీస్ రోడ్డులో వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై వాహనాలు అతివేగంతో రాకపోకలు సాగిస్తున్నాయి. వడక్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహన డ్రైవర్లకు సర్వీస్ రోడ్డు వెంట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. జిన్నారం వైపు వెళ్లే రోడ్డు ఎత్తు పెంచి ప్రమాదాలు నివారించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు, బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తాయి. సర్వీస్ రోడ్డులో జిన్నారం వైపు వెళ్లే రోడ్డు అని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో జిన్నారం వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతుండడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు.

## పాఠశాలలకు వేసవి సెలవులు

- నేటి నుంచి జూన్ 12 వరకు కొనసాగనున్న సెలవులు
- ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేసవి సెలవులు రానే వచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. ఈనెల 24 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. బుధవారం పాఠశాలలకు చివరి పని దినం కావడంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేవు. స్టేట్, సెంట్రల్ సిలబస్‌కు సంబంధించిన పరీక్షలన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలన్నీ మూత పడ్డాయి. హాస్టళ్లలో ఇన్నాళ్లు ఉన్న విద్యార్థులు తమ ట్రంకు పెట్టెలు, బ్యాగులతో ఇంటిబాట పట్టారు. జూన్ 13న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలో తిరగవద్దని, ముఖ్యంగా చెరువులు, కుంటలు, బావుల వద్దకు సరదాగా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. తమ పిల్లలను తల్లిదండ్రులు కనిపెడుతూ ఉండాలని సూచించారు.

# ఆకట్టుకుంటున్న వాల్ రైటింగ్స్

- తెలంగాణ ఉద్యమం నాటి రోజులు గుర్తుచేసుకుంటున్న ప్రజలు
- కేసీఆర్ పేరును చూసి జేజేలు పలుకుతున్న జనం
- ఊరూరా రజతోత్సవ సభ వాల్ రైటింగ్స్
- చాలారోజుల తర్వాత పెయింటర్లకు ఉపాధి



పటాన్‌చెరులో ఆకర్షణీయంగా గోడలపై వరంగల్ సభ వాల్‌రైటింగ్




ముత్తంగిలో బీఆర్ఎస్ నాయకులు వాల్‌రైటింగ్ రాస్తూ..

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 23: 'చలో వరంగల్' అంటూ... గోడలపై వెలుస్తున్న బీఆర్ఎస్ బహిరంగ సభ వాల్‌రైటింగ్ ప్రజలను ఆకట్టుకుంటున్నది. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను ప్రభావితం చేసిన ప్రచారాస్త్రం వాల్‌రైటింగ్. ఇప్పుడు చాన్నాళ్లకు తిరిగి కండ్లముందు వాల్‌రైటింగ్ దర్శనం ఇస్తుండడంతో ప్రజలు ఆసక్తిగా చూస్తూ తన్మయత్వం చెందుతున్నారు. ఉద్యమకారుడు, పోరాటయోధుడు కేసీఆర్ 2001లో పార్టీ పెట్టిన సమయంలో ఊరూరా జైతెలంగాణ నినాదాలతో చేయించిన వాల్‌రైటింగ్ ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. మీడియా లేని కాలంలో వాల్‌రైటింగ్, హ్యాండ్‌రైటింగ్ బ్యానర్ల ప్రభావం అధికంగా ఉండేది. గ్రామ నడిబొడ్డున వాల్‌రైటింగ్ రాసివెళ్తే చాలు ఆ తేదీకి ప్రజలు తెలంగాణ సభలకు స్వచ్ఛందంగా వచ్చేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సభలకు ఇసుక వేస్తే రాలనంతమంది వచ్చి సభలను దిగ్విజయం చేశారు. ఆశక్తి ఈ వాల్‌రైటింగ్‌కు ఉంది. సోషల్ మీడియా, టీవీ చానళ్లు, ఇతర ప్రచార మార్గాలు ఎన్ని ఉన్నా పెయింటర్స్ చేతితో ఫ్లోరోసెంట్ రంగులు వాడి రాసే వాల్‌రైటింగ్ చూడముచ్చటగా ఉండేవి. ప్రజలపై వాల్‌రైటింగ్స్ ప్రభావం చూపేవి. ఉద్యమ స్ఫూర్తిని నింపేది. ఈనెల 27న వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నిర్వహించే రజతోత్సవ సభ సమాచారం ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు వాల్‌రైటింగ్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఒకప్పుడు వాల్‌రైటింగ్ చూపిన ప్రభావం ఇప్పుడు కూడా ప్రజల్లో కనిపిస్తున్నది.

### కేసీఆర్ పేరుకు జేజేలు...

కేసీఆర్ పేరును హైలెట్ చేస్తూ, ఉద్యమస్ఫూర్తిని గుర్తుచేసేలా పెయింటర్లు వాల్‌రైటింగ్ చేస్తున్నారు. జిగేల్ అనేలా రాస్తున్న ఈ వాల్ రైటింగ్‌లు చూడముచ్చటగా ఉంటున్నాయి. ప్రజలు ఆగి మరీ వాటిని చదువుతున్నారు. జైకేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్నారు. యువతరం వాల్‌రైటింగ్‌ను కొత్తదనంగా చూస్తుండగా, సీనియర్ సిటిజన్స్ మాత్రం పాత ఉద్యమ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. చాన్నాళ్లకు చేతినిండా పనిదొరకడంతో పెయింటర్లు ఆనందంతో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము నాలుగు రూపాయిలు చూస్తున్నామని, దశాబ్ద కాలంగా ఫ్లెక్సీలు రావడంతో తమను ఎవరు పలకరించలేదని పెయింటర్లు 'నమస్తే తెలంగాణ'తో అన్నారు. దశాబ్దం తరువాత తమకు వాల్‌రైటింగ్ పని బాగా దొరుకుతున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు కేసీఆర్ పేరును రాస్తుంటే వెనుక నుంచి జై తెలంగాణ అని అంటున్నారని పెయింటర్లు పేర్కొనడం విశేషం. కేసీఆర్ పేరుకు రెస్పాన్స్ అద్భుతంగా ఉందని పెయింటర్లు చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమం ప్రజల్లోకి నేరుగా వెళ్లేందుకు దోహదపడిన వాల్‌రైటింగ్స్ తిరిగి గ్రామాల్లో ప్రత్యక్షం కావడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం మొత్తం పార్టీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి వాల్‌రైటింగ్స్ రాయిస్తున్నారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా బీఆర్ఎస్ నాయకులు దగ్గరుండి ఈ వాల్‌రైటింగ్‌ను రాపిస్తున్నారు. గ్రామాల్లో గులాబీ రంగుల గుభాళింపు మళ్లీ మొదలైంది.

### కేసీఆర్ పేరును ఇష్టపడుతున్నారు



నాకు పటాన్‌చెరు, రామచంద్రాపురం, ఇతర మండలాల్లో వాల్‌రైటింగ్ రాసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆర్డర్ ఇచ్చింది. నాతో పాటు మరో నాలుగు బ్యాచ్‌లు ఊరూరా చలో వరంగల్ వాల్‌రైటింగ్ రాస్తున్నాం. పదేండ్లుగా నాకు వాల్‌రైటింగ్ పనులేవి రాలేదు. ఇప్పుడు బీఆర్ఎస్ ఇచ్చిన పనితో నేను ఊరూరా వాల్‌రైటింగ్ రాస్తున్నాను. ప్రజల్లో మంచి రెస్పాన్స్ వస్తున్నది. కేసీఆర్ పేరు రాస్తుంటే వెనుకనుంచి జై కేసీఆర్ అని ప్రజలు అరుస్తున్నారు. జైతెలంగాణ అంటూ పిడికిలి బిగించి నినాదాలు చేస్తున్నారు. మేము కేసీఆర్ పేరును ప్రతి చోట కొత్తరకంగా, అట్రాక్షన్ వచ్చేలా రాస్తు న్నాం. చాన్నాళ్లకు మాకు ఉపాధి లభించింది. – నర్సింలు, పెయింటర్, రామచంద్రాపురం

## సద్దుమణిగిన మూడు దశాబ్దాల సమస్య


ఖాజీపూర్‌లో చేపల సమస్య పరిష్కారానికి మాట్లాడుతున్న పోలీసులు, గ్రామస్తులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఏప్రిల్ 23 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న చేపలు పట్టే సమస్య బుధవారం సద్దుమణిగింది. ఈ గ్రామంలో 30 ఏండ్ల నుంచి గ్రామస్తులంతా సమష్టిగా ఏకమై చెరువులో చేపలు పట్టేవారు. చేపలు అమ్మగా వచ్చిన డబ్బులు గ్రామాభివృద్ధికి ఉపయోగించేవారు. చెరువులో చేపలు పట్టుకునే హక్కు తమకే ఉందని, గ్రామానికి చెందిన ఇతరులు చేపలు పట్టవద్దని ముదిరాజ్‌లు డిమాండ్ తెచ్చారు. ఈ విషయంలో గ్రామస్తులు, ముదిరాజ్‌లకు పలుమార్లు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మత్స్య సహకారం సంఘం సొసైటీలో ముదిరాజ్‌లు సభ్యత్వం తీసుకోవడంతో కోర్టు కూడా ముదిరాజులకే అనుకూలంగా చేపలు పట్టడానికి తీర్పు ఇచ్చింది. చెరువులో చేపలు పట్టాలని ముదిరాజ్‌లు నిర్ణయం తీసుకోవడంతో గ్రామస్తుల్లో ఆందోళన ఏర్పడింది. ఎట్టి పరిస్థితుల్లో ముదిరాజ్‌లను చెరువులో చేపలు పట్టనీయమని గ్రామస్తులు మొండికేశారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, భూంపల్లి ఎస్సై హరీశ్ పోలీస్ బలగాలతో బుధవారం గ్రామంలో మోహరించి పికెటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామస్తుల, ముదిరాజుల మధ్య పోలీసులు సయోధ్య కుదిర్చారు. చేపలు పట్టే ఆదాయంలో 60 శాతం గ్రామాభివృద్ధికి, 40 శాతం ఆదాయం ముదిరాజ్‌లకు ఇవ్వాలని అంగీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఏండ్ల నాటి సమస్య సద్దుమణిగింది.